# ఉనికి

దాదాపు నాలుగు గంటలకు పైగా మేము కలిసి ప్రయాణం చేస్తున్నా పుస్తక పఠనంలో లీనమయిపోయిన నేను ఆమెను శ్రద్ధగా గమనించలేదు. అరగంటలో బండి తెనాలి చేరుకుంటుందనగా ఆమె నన్ను పలకరించటానికి ప్రయత్నం చేస్తున్నట్లు అనిపించింది. కంపార్ట్‌మెంట్‌లో జనం అట్టే లేరు.

పుస్తకం మూసి సంచిలో పెట్టి ఆమె వంక చూశాను. ఆమెకు ఇరవయి ఎనిమిది సంవత్సరాల వయసు ఉంటుందేమో, చామన చాయలో ఆకర్షణీయంగా ఉంది. పక్కనే నాలుగేళ్ల పాప ఉంది.

"నీ పేరేమిటమ్మా?" పాపను అడిగేసరికి తల్లి చాటుకు జరిగింది.

పాప తరపున తల్లి సమాధానం చెప్పింది, "పావని". ఆమె గొంతు బొంగురుగా ఉంది.

పాపకు నేనంటే బిడియం తగ్గిందనుకుంటాను. చాటునుండి తల్లి ముందుకు వచ్చింది. "బడికి వెళ్తున్నావా?" అడిగాను. పాప నా ముఖంలోకి చూసింది కాని జవాబు చెప్పలేదు.

నవ్వి, "పావనికి మాటలు రావు" అన్నాను.

"వచ్చు" అంది పావని.

"ఏం చదువుతున్నావు?"

"బడిలో చేర్పించలేదండీ. వచ్చే సంవత్సరం చేర్పిద్దామనుకుంటున్నాం" అందామె. అని కొద్దిసేపు మౌనంగా ఉండి, "మీరెక్కడికి వెళ్తున్నారు?" అడిగింది.

చెప్పాను.

"నేను వేమూరు దాటి వెళ్లాలి" అంది.

"ఏ ఊరు?"

చెప్పలేదు. చెప్పటం ఇష్టం లేదనుకుంటాను.

చేతి గడియారం వంక చూసుకుని, "ఈ బండి రెండు గంటలు ఆలస్యంగా

నడుస్తోంది. ఈ సరికి రేపల్లె బండి వెళ్లిపోయి ఉంటుందేమో" అనుమానం వ్యక్తం చేశాను.

"టైం ఎంతయింది?"

"తొమ్మిదీపది."

"మీరేం చేస్తుంటారు?"

"కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను."

"ఎక్కడ?"

చెప్పాను.

"తెనాలి మీ స్వస్థలమా?"

"దాదాపు అంతే, నా భార్యా పిల్లలు చినరావూరులో ఉంటున్నారు. నేను అప్ అండ్ డౌన్ చేస్తుంటాను. వరసగా మూడు రోజులు సెలవు. దొరికితే మా ఇంటికి వెళ్తున్నాను."

"నేనూ పండక్కి మా పుట్టింటికి వెళ్తున్నాను. మా ఆయనకు సెలవు దొరకలేదు. పండగ నాటికి వస్తానన్నారు. వస్తారో, లేదో తెలియదు...." రాదని ఆమెకు స్పష్టంగా తెలుసన్నట్టు అనిపించింది.

"మీవారు ఎక్కడ పనిచేస్తున్నారు?"

చెప్పింది.

"ప్రైవేటు కంపెనీలోనా?"

తలూపింది. "మా తమ్ముడు రఘు తెనాలిలో కారు బాడుగకు తిప్పుతుంటాడు. వాడిని స్టేషనుకొచ్చి నన్నూ పావనిని తీసుకెళ్లి మా ఊళ్లో వదిలిపెట్టమని మా ఆయన ఫోను చేసి చెప్తే సరే అన్నాడట. నన్ను బండి ఎక్కించాక మళ్లీ వాడికి ఫోను చేసి చెప్తానన్నారు....." ఆగింది. నాకు అనవసరమయిన విషయం కాదది. కావాలనే చెప్పింది. తెలివి కలిగిన వ్యక్తి.

"ఒంటరిగా ప్రయాణం చేయటం కొత్తా?"

"కాదు." తల అడ్డంగా ఆడించింది.

"మీరు భయపడవలసిన అవసరం లేదు. మీ తమ్ముడు మీకోసం తెనాలి స్టేషన్‌లో ఎదురు చూస్తూ ఉంటాడు."

"మా రఘు వట్టి మతి మరుపు వెధవ."

"మీ వాడు రాకపోతే బస్సులో వెళ్లండి."

"ఈ సమయంలో మా ఊరికి బస్సులుండవు."

మాటల్లో తెనాలి వచ్చింది. నా సంచి భుజానికి తగిలించుకుని బండి దిగి పావనిని అందుకున్నాను. తన సామాన్లు బండిలోంచి దింపటానికి సహాయం చేసి వాటిని ప్లాట్ ఫాం మధ్యలో ఉన్న బెంచి మీద పెట్టాను. అన్ని సామాన్లు వచ్చాయో, లేదో అని ఒకటికి రెండు సార్లు లెక్కపెట్టుకుంది. నాకు వెళ్ళిపోదామని ఉంది. ఆమె తమ్ముడికోసం అటూ ఇటూ దృష్టి సారించింది కాని అతను వచ్చినట్లు లేకపోయేసరికి ముఖంలో కలవరం మొదలయింది. పావనిని ఎత్తుకుంది.

"నే వెళ్తాను" కదలబోయాను.

"మాట."

ఆగాను.

"దయచేసి మీరు నాకో సహాయం చేయగలరా?"

నా ఇబ్బంది ముఖంలో కనిపించనీయకుండా "చెప్పండి" అన్నాను.

"మా తమ్ముడు వచ్చాడో, లేదో బయటకు వెళ్లి చూసి వస్తాను. అంతవరకు ఈ సామాన్లు చూస్తుండగలరా?"

తలూపి, "త్వరగా వచ్చేయండి" అన్నాను.

ఆమె బయల్దేరబోతూ ఆగి, "మీ పేరు?" అడిగింది. చెప్పాను. "నా పేరు సుమిత్ర" అని మెయిన్‌గేట్‌వైపు నడిచింది.

టీస్టాలులో వేడివేడి టీ తాగి సిగరెట్ వెలిగించాను. ఆలస్యం అయ్యేకొద్దీ చిరాకు కలగటం మొదలెట్టింది. అరగంట తర్వాతగాని సుమిత్ర తిరిగి రాలేదు. వచ్చీరాగానే బెంచి మీదున్న సామాన్లు లెక్కపెట్టుకొని నా వంక చూసి, "మా వాడు ఎక్కడ చచ్చాడో ఏమో రాలేదు. వాడి స్నేహితులు కూడా ఎవరూ కనబడలేదు...." విసుగ్గా అని పావనిని కిందకు దింపి చీర కొంగుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ "ఇప్పుడు నన్నేం చేయమంటారు?" నెమ్మదిగా అడిగింది.

"ఈ ఊళ్ళో మీ చుట్టాలు ఎవరూ లేరా?"

"లేరు."

"తెలిసిన వాళ్ళు?"

"ఊహు."

"మీకు ఎటువంటి అభ్యంతరం లేకపోతే మా ఇంటికి రండి."

"మీ కూడా నేనొస్తే మీ వాళ్లేమీ అనుకోరా?"

"ఏమీ అనుకోరు. నా భార్య చాలా మంచిది."

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నానేమో."

"లేదు. ఏంలేదు. ఈ రాత్రికి మా ఇంట్లో ఉండి, రేపు ఉదయాన్నే బస్సు పట్టుకుని వెళ్లండి...." అంటుంటే నా మాటలకు అడ్డుతగిలి. "సరే, పదండి" అంది కాని స్టేషన్ బయటకు వచ్చాక మనసు మార్చుకుని, "మీరేమనుకోవద్దు. మీ ఇంటికి రాను. ఈ రాత్రికి ఇద్దరం ఏ హోటలుకయినా వెళ్దాం. హోటలులో ఒక్కదాన్నే ఉండలేకకాదు. రిస్క్ తీసుకోవటంనాకు ఇష్టం లేదు. దయచేసి నా మాట కాదనకండి...." నాకు మొహమాటం ఎక్కువ. ఆడవాళ్ల విషయంలో మరీను. ఆమె బతిమలాడుతుంటే కాదనలేకపోయాను.

"ఈ రాత్రి మీరు ఇంటికి వెళ్లలేకపోతే మీ వాళ్లు గాభరాపడరుకదా?" అడిగింది.

"లేదు. ఏదో పనుండి ఆగిపోయానని అనుకుంటారు."

సుమిత్ర రిక్షాపిలిచి, మాట్లాడి, తను ఎక్కి కూర్చుని, జరిగి నాకు చోటిచ్చింది. ఆమె ఒడిలో పావని కూర్చుంది. సామాన్లు కాళ్లదగ్గర సర్దిపెట్టాక సరిగా కూర్చున్నాను. రిక్షా కదిలింది. సిగరెట్ తీసి వెలిగించాను.

"ప్లీజ్... సిగరెట్ పడేయండి.... సిగరెట్ పొగ నాకు పడదు.... నిజం చెప్పాలంటే సిగరెట్ తాగే వాళ్ళంటే నాకు అసహ్యం...." అంది నిర్మొహమాటంగా.

నేను సిగరెట్ తాగటం గురించి అంత మాట ఎప్పుడూ, ఎవరూ అనలేదు. రిక్షా ఆపి దిగిపోదామనిపించింది. కోపాన్ని నిగ్రహించుకుని పీల్చిన పొగ పక్కకు ఊది సిగరెట్ మురికి కాలవలో పడేలా విసిరాను. పది నిమిషాల తర్వాత రిక్షా ఉడ్‌లాండ్స్ హోటలు ముందాగింది. నా పేర డబుల్ బెడ్ రూం తీసుకున్నాను. అడ్వాన్స్ ఇచ్చి గదిలోకి వచ్చాక నే కట్టిన అడ్వాన్స్ వద్దంటున్నా సుమిత్ర నాకిచ్చేసింది. స్నానం చేసి గదికి వచ్చిన క్యారియర్ భోజనం చేసిన తర్వాత మంచం మీద సుమిత్ర, పావని పడుకున్నారు. నా సంచిలోంచి దుప్పటి బయటకు తీసి నేలమీద పరుచుకున్నాను. లైటు ఉంటే నాకు నిద్ర పట్టదు. లైటార్పేయబోతుంటే, "లైటు ఉండనీయండి. తలుపు కూడా తీసి ఉంచండి" అంది. ఆమె మాటలు కొద్దిగా కటువుగా ఉన్నట్లు అనిపించింది.

లైటు ఆర్పేయలేదు. తలుపు బార్లా తెరిచి నా సంచిని తలగడగా పెట్టుకుని పడుకున్నాను. ఆమె భయం నాకు అర్థం అయింది. ఆమెకు సహాయం చేసే ఉద్దేశం తప్ప వేరే విధమయిన తలంపు నాకు లేదు. కొద్దిసేపు ఇబ్బంది పడిన తర్వాత కాని నాకు నిద్ర పట్టలేదు.

తెలతెలవారుతుండగా స్నానాల గదిలో నీళ్ల చప్పుడవుతుంటే మెలకువ వచ్చింది. గది తలుపు మూసి గడియ పెట్టి ఉంది. మంచం మీద పావని నిద్రపోతోంది.సుమిత్ర లేదు. స్నానం చేస్తుందనుకుంటాను. గదిలోని గాలి చల్లగా ఉంది. తువ్వాలు కప్పుకుని కళ్లు మూసుకున్నానో లేదో నిద్ర పట్టింది.

అరగంట తర్వాత నా చేతికి చల్లటి స్పర్శ తగిలేసరికి నిద్ర జారిపోయింది. తువ్వాలు తీసి ముఖం తుడుచుకున్నాను. లేచి కూర్చుందామనుకున్నాను. వీలుకాలేదు. సుమిత్ర నా పక్కనే నాకు ఆనుకుని కూర్చుని ఉంది. ఆమె చేతులు నా భుజాల మీద వేసి ఉన్నాయి. గంధపు సబ్బు వాసన నా ముఖానికి తగులుతోంది. రాత్రి నిద్రపోలేదేమో ఆమె కళ్లు ఎర్రగా ఉన్నాయి.

“మీకు చాలా శ్రమ కలిగించాను” అంది.

“నిజమే.”

“ఇంకొద్దిసేపటిలో మీ దారిన మీరెళ్లిపోతారు. నాదారిన నేనెళ్లిపోతాను. మీరు ఎటువంటి వారో తెలియక భయంతో రాత్రి నిద్రలేకుండా గడిపాను. మిమ్మల్ని అనుమానించినందుకు సిగ్గుపడుతున్నాను. మీరు నాకు ఎటువంటి శిక్ష అయినా వేయవచ్చు....” ఆమె శరీరం నాకు పూర్తిగా తగులుతోంది. ఆమె కోరుకుంటున్న శిక్ష ఆమె కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సంచిలోంచి సిగరెట్ తీసి వెలిగించాను. సుమిత్రకు సిగరెట్ తాగే వాళ్ళంటే అసహ్యం.

◆ ప్రియదత్త, వారపత్రిక, 22 సెప్టెంబరు 2004